ప్రొటోకాల్ పక్కనపెట్టి : ఆలయం నుంచి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతి.. రాంభగీచ సర్కిల్ వద్దకు నిలుచుని ఉన్న భక్తులను గమనించారు. ప్రొటోకాల్ పక్కన పెట్టి వాహనాన్ని రోడ్డుపైనే ఆపి భక్తుల వద్దకు వెళ్లి పలకరించారు. హెచ్‌టీ కాంప్లెక్స్ వరకు నడుచుకుంటూ వెళ్లి భక్తులకు అభివాదం చేశారు. కొందరు పిల్లలకు చాక్లెట్లు పంచారు. అనంతరం గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న ఆమె.. కాసేపు విశ్రాంతి తీసుకుని తిరుగు ప్రయాణమయ్యారు.

ప్రశాంతంగా రాష్ట్రపతి పర్యటన


రాష్ట్రపతి రాకతో నిర్మానుష్యంగా శ్రీవారి ఆలయ పరిసరాలు


లేపాక్షి సర్కిల్ వద్ద వేచిఉన్న భక్తులు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల తిరుమల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్న ఆమె.. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ్నుంచి వరాహస్వామి ఆలయానికి వెళ్లేందుకు టీటీడీ బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేసింది. చిరు జల్లుల కురుస్తున్నా.. రాష్ట్రపతి కాలినడకనే వెళ్లి వరాహస్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి రాష్ట్రపతితోనే రాగా.. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అర్చకబృందంతో కలిసి ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. గర్భాలయంలో మూలవిరాట్టును దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఛైర్మన్ శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. మంత్రి, ఛైర్మన్, ఈవో, అదనపు ఈవోతో పాటు బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, జానకీదేవి, పనబాక లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులున్నారు. సంప్రదాయాన్ని పాటిస్తూ రాష్ట్రపతి వ్యక్తిగత భద్రతాసిబ్బంది పంచె, షర్టుతో ఆలయ ప్రవేశం చేశారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా అక్కడక్కడ వాహనాలను ఆపేయడంతో భక్తులు స్వల్పంగా ఇబ్బంది పడ్డారు. ద్రౌపది ముర్ము దర్శన సమయంలో ఆలయం వద్దకు ఎవరినీ అనుమతించలేదు.


ద్రౌపది ముర్మును పలకరిస్తున్న శ్రీవారి ఆలయ పెద్ద, చిన్నజీయర్ స్వాములు


శ్రీవారి ఆలయం ముందు రాష్ట్రపతి

రాష్ట్రపతికి సాదర వీడ్కోలు


విమానాశ్రయంలో రాష్ట్రపతికి మెమెంటో ఇస్తున్న మంత్రి అనిత

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: తిరుమల నుంచి శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత, తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఆమెకు సాదర వీడ్కోలు పలికారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లారు.


శ్రీవారి ఆలయంలో రాష్ట్రపతితో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

పోలీసు నిఘాలో తిరుపతి

- మావోయిస్టులు తలదాచుకునే అవకాశాలున్నాయని అనుమానం
- కొత్త మనుషులు కనిపిస్తే ప్రశ్నలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భద్రతా బలగాలు దండకారణ్యాన్ని జల్లెడ పడుతుండడంతో మావోయిస్టులు ఏపీలోని నగరాలను అజ్ఞాత ఆవాసాలుగా మార్చుకుంటున్నారనే సమాచారంతో తిరుపతి మీద కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెంచారు. కానూరు న్యూ ఆటోనగర్‌లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడిన తర్వాత తిరుపతి ఆటోనగర్, తారకరామనగర్ వంటి ప్రాంతాల మీద దృష్టి పెట్టారు. అలిపిరిలో చంద్రబాబుపై దాడి సమయంలో నక్సల్స్ తిరుపతిలోనే కొంతకాలం పాటు ఉన్నట్టు ఆ తర్వాత వెల్లడైన సంగతి తెలిసిందే. దీంతో దేశం నలుమూలల నుంచి వేలాది మంది రోజూ వచ్చిపోయే తిరుపతిని మావోయిస్టులు సురక్షిత ప్రాంతంగా భావించే అవకాశం ఉండడంతో కొత్త వ్యక్తుల గురించి ఆరా తీస్తున్నారు. యూపీ, బిహార్ వంటి ప్రాంతాల నుంచి భవన నిర్మాణ కార్మికులు, కార్పెంటర్లు, రోడ్ల పనివారు పెద్ద సంఖ్యలో తిరుపతిలో ఉంటున్నారు. జీవకోన, మంగళం, తారకరామనగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో పోలీసులు నిరంతర నిఘా ఉంచారు. అనుమానాస్పదంగా కనిపిస్తే ప్రశ్నిస్తున్నారు. బాంబు, డాగ్ స్క్వాడ్లు కూడా రంగంలోకి దిగినట్టు తెలిసింది. కొత్త వ్యక్తులు తారసపడితే, వారి వివరాలన్నీ సేకరిస్తున్నారు. ఆధార్ కార్డు ద్వారా నిర్ధారించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. ఈక్రమంలో ఆధార్ కానీ, ఓటరు కార్డు కానీ లేకుండా చాలా మంది ఉన్నట్టు గుర్తించారు. ఎవరైనా అనుమానాస్పద రీతిలో కనిపిస్తే 112 నెంబరుకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని స్థానికులను పోలీసులు కోరుతున్నారు.

0877- 2236007

- తుఫాను హెచ్చరికతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ అవకాశాలు కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు తుఫాను హెచ్చరిక రావడంతో కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. ప్రజలకు ఏవైనా అవసరముంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను 0877-2236007లో సంప్రదించాలన్నారు.

పిడుగుపాటుతో పేలిన మొబైల్

- వరినాట్లు వేస్తున్న యువకుడికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పొలంలో వరినాట్లు వేసే క్రమంలో పిడుగుపాటుతో జేబులో ఉన్న మొబైల్‌ఫోన్ పేలడంతో నరసింహారెడ్డి(36) తీవ్రంగా గాయపడ్డాడు. తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగకు చెందిన ఈయన ఇంటి సమీపంలోని పొలంలో శుక్రవారం సాయంత్రం వరి నాట్లు వేస్తున్నారు.ఈ క్రమంలో పిడుగుపాటుకు అతడి జేబులోని సెల్‌ఫోను పేలింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరుకు తీసుకెళ్లారు.

'మాక్ అసెంబ్లీ'కి విద్యార్థుల ఎంపిక



మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులతో డీఈఓ కేవీఎన్ కుమార్

తిరుపతి(విద్య), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 26న జరగనున్న జిల్లాస్థాయి మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి నియోజకవర్గాల వారీగా ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపికచేశారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి అల్లూరి చిన్నమయి, గూడూరు నుంచి పి.సాగర్‌కుమారి, సత్యవేడు నుంచి అంశుమేరి, శ్రీకాళహస్తి నుంచి మహిజ, సూళ్లూరుపేట నుంచి కావలి పల్లవి, తిరుపతి నుంచి బొబ్బిలి భవ్యశ్రీ, వెంకటగిరి నుంచి మేఘన ఎంపికయ్యారు. అలాగే సబ్‌స్టిట్యూట్‌గా కె.వెంకట దినకర్ ఎంపికయ్యారు. వీరిని డీఈవో కేవీఎన్ కుమార్, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీశంకర్ అభినందించారు. వీరికి అసెంబ్లీ విధివిధానాలపై ప్రత్యేక శిక్షణనిచ్చినట్టు తెలిపారు.

గజలక్ష్మీ నమోస్తుతే

- జనసంద్రమైన తిరుచానూరు
- ఉదయం పల్లకీపై మోహినిగా ఊరేగిన అమ్మవారు





శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు గరుడ సేవకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో.. అమ్మవారి ఉత్సవాల్లోనూ ఐదో రోజు గజ వాహనసేవకు అంతటి ప్రాధాన్యం ఉంది. తిరుమల శ్రీవారి లక్ష్మీకాసుల హారాన్ని ధరించి.. శుక్రవారం రాత్రి మహాలక్ష్మిగా పద్మావతి అమ్మవారు తన ప్రీతిపాత్రమైన గజ వాహనంపై ఊరేగారు. రాత్రి 7 నుంచి సుమారు 12 గంటల వరకు సాగిన గజవాహన సేవను తిలకించేందుకు పోటెత్తిన భక్తులతో తిరుచానూరు జనసంద్రంగా మారింది. కీలుగుర్రాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్క భజనలు, జీయర్ల పరివారం ప్రబంధ పారాయణం చేస్తుండగా గజ వాహన సేవ ముందుకు సాగింది. అమ్మవారికి హారతులిచ్చేందుకు భక్తులు పోటీపడ్డారు. తరలివచ్చిన భక్తజనంతో మాడవీధులు రద్దీగా మారాయి. ఉదయం.. మోహినీ రూపంలో పల్లకిలో వయ్యారంగా కూర్చున్న అమ్మవారు.. తన సుందర మనోహర సౌందర్యాన్ని ఎదురుగా ఉన్న దర్పణంలో చూసుకుని మురిసిపోతున్నట్లు కదులుతూ పరవశింపచేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చిరుజల్లుల మధ్య పల్లకీ వాహనసేవ జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, సుచిత్ర యెల్లా, సాంబశివరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం వసంతోత్సవం జరిగింది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 8 గంటలు: సర్వభూపాల వాహనం
సాయంత్రం 4.20 గంటలు: స్వర్ణరథోత్సవం
రాత్రి 7 గంటలు: గరుడవాహనం



కుప్పం ప్రజలకు రుణపడి ఉంటా!

- నారా భువనేశ్వరి


ఆధార్ కార్డు లేకపోవడంతో ఆర్టీసీ బస్సులో టికెట్టు తీసుకుంటున్న భువనేశ్వరి

కుప్పం/శాంతిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నాయకత్వం మీద మీకున్న గురి ఎప్పుడూ నన్ను అబ్బురపరుస్తుంది. 8 సార్లు ఆయనను మీరు ఇక్కడినుంచి గెలిపించారు.ఇందుకు జీవితాం తం కుప్పం ప్రజలకు రుణపడి ఉంటా'.....ముఖ్యమంత్రి చంద్ర బాబు సతీమణి, ఎన్టీఆర్ మెమో రియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం నియోజకవర్గ ప్రజలనుద్దేశించి అన్న మాటలివి. కుప్పం నియోజకవర్గ పర్యటనలో మూడవ రోజైన శుక్రవారం ఆమె శాంతిపురం, రామకుప్పం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా శాంతిపురం మండలం నడింపల్లెలో మహిళలతో జరిగిన ముఖాముఖిలో భువనేశ్వరి సంభాషిస్తూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందాయా అంటూ ఆరా తీశారు.హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను కుప్పం తీసుకురావడంతో కరువు సమస్య శాశ్వతంగా పరిష్కారమైందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడంవల్లే తాను ఆయన బదులుగా తరచూ కుప్పం వచ్చి ఇక్కడి ప్రజల సాదకబాధకాలు తెలుసుకుంటున్నానన్నారు. ఎటువంటి సమస్యనైనా చంద్రబాబుతో చెప్పి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా కూడా మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే ఎన్నో రకాల వృత్తులు, పనుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు అలీప్ సంస్థను తీసుకు వచ్చారన్నారు. మహిళలందరూ ఈ ప్రాజెక్టులో చేరి వారిచ్చే శిక్షణలో పాల్గొని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌలభ్యాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, ఉద్యోగ, ఉపాధి రంగాలలో పైకి ఎదగడానికి వినియోగించుకోవాలని సూచించారు.కాగా శాంతిపురం మండలంలో తుమ్మిశి పెద్ద చెరువు, రామకుప్పం మండలం విజలాపురం చెరువుల వద్ద కృష్ణా జలాలకు భువనేశ్వరి హారతి ఇచ్చారు. అంతకుముందు శాంతిపురం మండలం కడపల్లెనుంచి తుమ్మిశి పెద్ద చెరువు దాకా ఆర్టీసీ బస్సులో మహిళలతో కలిసి ప్రయాణించి స్త్రీ శక్తి పథకం ద్వారా వారు పొందిన లబ్ధిని గురించి వారినే అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం నుంచి కనమనపల్లె దాకా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ.7 కోట్ల దోపిడీ కేసులో గుడిపాలవాసి

చిత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో రూ.7 కోట్లను ఏటీఎంలలో నింపేందుకు తీసుకెళ్తుండగా దోపీడీ చేసిన ముఠాలో చిత్తూరుజిల్లా గుడిపాల మండలం చిత్తపారకు చెందిన రవి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గురువారం రాత్రి ఇతడి తండ్రి మాజీ ఆర్మీ ఉద్యోగి రామదాసును అరెస్టు చేసి బెంగళూరుకు తీసుకెళ్లారు. శుక్రవారమూ గుడిపాలలో పోలీసుల గాలింపు కొనసాగింది.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పాకాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా బలపడే అవకాశమున్నందున ముందు జాగ్రత్తగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సంతోష్ సాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఫిర్యాదు చేసేందుకు వీలుగా 9492712100ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు మేజర్, మైనర్ చెరువులు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

అన్నదానం గొప్ప సంకల్పం


అన్నదానం చేస్తున్న హరిప్రసాద్, బీగాల అరుణ, గ్రామస్తులు

చంద్రగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాసమంగాపురంలో వెలిసిన కనకదుర్గమ్మ (వస్కోటు ఎల్లమ్మ) ఆలయంలో గ్రామస్తులు ప్రతి శుక్రవారమూ భక్తులకు అన్నదానం చేయడం గొప్ప సంకల్పమని ఏపీ హస్తకళ అభివృద్ధి సంస్థ చైర్మన్, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఆయన జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి బీగాల అరుణతో కలిసి ప్రారంభించారు. గ్రామస్తులతో కలిసి ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మోహన్ సోదరుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు అంతరాజ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మూడు నెలలుగా భక్తులకు అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో తాను పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గేట్ మణి, మోరపు వాసు, ముబ్బు మహేష్, ఉదయగిరి కుమార్, కోలా పురుషోత్తం, బాలసుబ్రమణ్యం, సకల భాను, మాలతి, మంజుల, కంచమ్మ, పూల సురేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పేరిట ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న చైర్మన్ చంద్రశేఖరరెడ్డి

చంద్రగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని జన్మదినం సందర్భంగా మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పూజలు నిర్వహించిన తర్వాత అన్నదానం చేశారు. చైర్మన్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ, ఆలయాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఎల్లమ్మను కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కాపువీధి సునీల్ పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ


సారె ఊరేగింపుగా తీసుకొస్తున్న మోహిత్‌రెడ్డి

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పద్మావతి అమ్మవారికి శుక్రవారం సారె సమర్పించారు. తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సారెతో ఊరేగింపుగా తిరుచానూరు అమ్మవారి ఆలయానికి చేరుకుని, ఆలయాధికారులకు అందజేశారు. వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పచ్చదనం-పరిశుభ్రతపై శిక్షణ


శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాకాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా గ్రామాలలో పచ్చదనం, పరిశుభ్రతపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం పాకాల పంచాయతీలో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్‌లు, పారిశుధ్య సిబ్బందికి తడిపొడి చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించడంపై శిక్షణ ఇచ్చారు. పాకాల పంచాయతీ పరిధిలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రంలోని కార్యకలాపాలను వివరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కస్తూరి, ఎంపీడీవో వాసుదేవరావ్, డిప్యూటీ ఎంపీడీవో శశిరేఖ, స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వాసుదేవరావు

పాకాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఇరంగారిపల్లెలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఎంపీడీవో వాసుదేవరావ్ ప్రారంభించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సేవాభావంతో ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత గురించి వివరించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన దృక్పథాన్ని మార్చడంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర వహిస్తుందన్నారు. ఇరంగారిపల్లె పంచాయతీ పరిధిలో వారం రోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవో మాశిలామణి, అధ్యాపకులు చిట్టి కళావతి, మోహన్ బెహరా, రాజశేఖర్ రెడ్డి, ఈశ్వరబాబు, రమణమ్మ, హెచ్‌ఎం మునిరాజారెడ్డి పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు బీరువాల వితరణ


బీరువాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాకాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 1985-86 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు రెండు బీరువాలు అందజేశారు. ఎంఈవో బాబ్జీ చేతులమీదుగా శుక్రవారం పాఠశాలలో హెచ్‌ఎం సునీతమ్మకు ఇచ్చారు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చెంగల్రాయులు, విశ్వప్రసాద్, మధుసూదన్, విజయకుమార్, హేమచంద్రనాయుడు, ఆయూబ్, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం


రంగన్నగారిగడ్డలో చెత్తను శుభ్రం చేస్తున్న హరిత రాయబారులు

భాకరాపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గ్రామాలను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డలో పచ్చదనం, పరిశుభ్రత పైలెట్ ప్రాజెక్టులో భాగంగా పరిశుభ్రం చేయించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందన్నారు. వాతావరణ కాలుష్యం లేకుండా మొక్కలను విరివిగా పెంచుకోవాలన్నారు. ఇళ్ల వద్దకు వచ్చే హరిత రాయబారులకు తడి-పొడి చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర్ రెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్ కుమార్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో కబ్జాల పర్వం

● ఎ.రంగంపేటలో కొనసాగుతున్న ఆక్రమణలు




అక్రమ నిర్మాణాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ మీటర్లు, సోలార్ సిస్టం - అక్రమ నిర్మాణం కోసం భూమిని చదును చేసిన దృశ్యం

చంద్రగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.రంగంపేట పంచాయతీలో ప్రభుత్వ భూముల కబ్జాల పర్వం కొనసాగుతోంది. తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారిని ఆనుకుని నాగపట్ల రెవెన్యూ లెక్కదాఖలాల్లో సర్వే నెంబర్ 80-ఏలో కోట్లాది రూపాయల విలువైన 8.31 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని కొంతమంది చదును చేసి, గ్రావెల్ తోలుతున్నారు. వైసీపీ హయాంలో కొందరు ఈ భూమిలో షెడ్లు నిర్మించుకుని, విద్యుత్ మీటర్లు పొందారు. ఫిర్యాదు చేసినా అధికారులు వాటిని తొలగించలేదు. కూటమి ప్రభుత్వం రాగానే ఆ షెడ్లకు పైలెట్ ప్రాజెక్టు కింద సోలార్ సిస్టం ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఎవరైనా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ఖాతరు చేయడం లేదు. దీనిపై పత్రికలలో కథనాలు రావడంతో విద్యుత్ మీటర్లు తొలగించాలని పంచాయతీ అధికారులు విద్యుత్, రెవెన్యూ శాఖలకు నోటీసులు పంపి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికీ ఆ భూమిలో కబ్జాల పర్వం జరుగుతూనే ఉంది. అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నా దృష్టికి రాలేదు

నాగపట్ల రెవెన్యూ లెక్కదాఖలాల్లోని సర్వే నెంబర్ 80-ఎలో ప్రభుత్వ భూమి కబ్జా విషయం నా దృష్టికి రాలేదు. అధికారుల నుంచి సమాచారం తెప్పించుకుని విచారించి చర్యలు తీసుకుంటాం.

- శివరామసుబ్బయ్య, తహసీల్దార్

వాతావరణ కేంద్రాల ఏర్పాటుకు కృషి

కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తానంద అగర్వాల్


వాతావరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ముక్తానంద అగర్వాల్

రామచంద్రాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాతావరణ సమాచారాన్ని స్వయంగా సేకరించి ప్రసారం చేసే అధునాతన స్వయం చాలక వాతావరణ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తానంద అగర్వాల్ తెలిపారు. శుక్రవారం ఆయన రామచంద్రాపురం మండలంలోని నడలూరు, రామచంద్రాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన స్వయం చాలక వాతావరణ, చేతితో కొలిచే వర్షపాత నమోదు కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్వయం చాలక వాతావరణ కేంద్రాల ద్వారా ప్రకృతి వైపరీత్యాలను ముందుగా గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసేందుకు వీలవుతుందన్నారు. అలాగే విపత్తుల నుంచి సులువుగా బయటపడవచ్చన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఏపీ వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి చంద్రకళతో సమావేశమై వాతావరణ కేంద్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, కార్యదర్శి సుమలత, వీఆర్ఏ ఓరుగంటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


అవగాహన ర్యాలీలో అధికారులు, విద్యార్థులు

భాకరాపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని అన్నారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. బాలబాలికలు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శివకుమార్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పద్మావతీ దేవి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద హోంమంత్రి అనిత - నందమూరి రామకృష్ణ

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆలయం వద్దకు రాగా డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్న ఆమెకు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. టీడీపీ నేత శ్రీధర్‌వర్మ ఉన్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ


అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే నాని దంపతులు

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమ్మవారి గజ వాహన సేవ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దంపతుల వెంట టీడీపీ నాయకులు అమిలినేని మధు, ఈశ్వరరెడ్డి, మధుశేఖర్, సుధ, కిషోర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


పద్మావతీ అమ్మవారి గజ వాహన సేవలో పాల్గొన్న చంద్రగిరి ఎమ్మెల్యే నాని, టీటీడీ, ఇతర శాఖల అధికారులు

ఆటో కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్ర

పాకాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర కోరారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో వర్కర్లకు సమగ్ర చట్టం అమలు చేయాలని కోరారు. వారిని క్రిమినల్ చట్టాలతో ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ప్రసాద్, ఆటో వర్కర్స్ మండల కన్వీనర్ యుగంధర్, జిల్లా కమిటీ సభ్యుడు వి.మురళి, బాలాజీ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఆనంద్, బాబు, దుర్గా ఆటోస్టాండు నాయకుడు వేణు, జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు సాత్విక్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి

ఎర్రావారిపాలెం, నవంబరు(ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక విద్యా బలోపేతానికి మండల విద్యా అకడమిక్ ఫోరం కృషి చేయాలని ఎంఈవో 1 బాలసుబ్రమణ్యం కోరారు. మండలంలోని మూడు క్లస్టర్ల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లతో స్థానిక ఎమ్మార్సీలో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. భాషాభివృద్ధి(తెలుగు, ఆంగ్లం), న్యూమరసీ (గణిత శాస్త్రం)లో ప్రతి విద్యార్థీ సామర్థ్యం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎంఈవో 2 సతీష్‌బాబు మాట్లాడుతూ బోధనలో ఉపాధ్యాయుల మధ్య పోటీ ఉండాలని, అప్పుడే విద్యార్థుల సామర్థ్యం పెరుగుతుందని అన్నారు.

చినబాబుకు సన్మానం


చినబాబును సత్కరిస్తున్న ఉపాధ్యాయ మిత్ర బృందం

రామచంద్రాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చినబాబును ఉపాధ్యాయ మిత్రబృందం శుక్రవారం కమ్మపల్లిలోని ఆయన స్వగృహంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు, డాక్టర్ సుధాకర్‌నాయుడు, బట్టా భాస్కర్, సాంబిరెడ్డి, శేషాద్రి, వేణు, శేఖర్ పాల్గొన్నారు.

ఆర్సీపురంలో జడివాన

రామచంద్రాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఉదయం నుంచి జడివాన కురిసింది. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన వర్షం రోజంతా విడిచి విడిచి కురుస్తూనే ఉంది. వ్యవసాయ పనులు పూర్తిగా ఆగిపోయాయి. పొలాల్లో నీరుచేరింది. చెరుకు తోటలకు మేలు చేకూరుతుందని రైతులు అంటున్నారు.

ఏవీపురం పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

తిరుపతిరూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారం ప్రైమరీ మోడల్ పాఠశాలను శుక్రవారం ఎంఈవో-1 పద్మజ తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. హెచ్‌ఎం పాల్గొన్నారు.

నేడు మూడు వాహన సేవలు

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారు శనివారం మూడు వాహనాలపై ఊరేగనున్నారు. ఉదయం సర్వభూపాల వాహనంపై మాడ వీధుల్లో భక్తులను సాక్షాత్కరించనున్నారు. సాయంత్రం 4.20 నుంచి 5.20 గంటల మధ్య స్వర్ణరథంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. దీని కోసం స్వర్ణరథానికి మెరుగులుదిద్దారు. సాంకేతిక సమస్యలతో ఎటువంటి అపశ్రుతులు జరగకుండా నిపుణులతో పరిశీలించి సిద్ధంగా ఉంచారు. రాత్రికి శ్రీవారి ఇష్ట వాహనమైన గరుడుడిపై.. అమ్మవారు విహరించనున్నారు. ఈ వాహన సేవలో శ్రీవారి పాదాలను అమ్మవారికి అలంకరిస్తారు.


తిరుపతి విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి



సగంలో వదిలేసిన సైడుకాలువ పనులు

అరకొరగా అభివృద్ధి పనులు

తిరుపతి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. సగం చేసి వదిలేయడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఎయిర్ బైపాస్ రోడ్డు నుంచి కార్యాలయం వరకు సిమెంట్ కాంక్రీటు వేశారు. అయితే రోడ్డుకిరువైపులా ఏర్పడిన గుంతలను పూడ్చకుండా వదిలేశారు. సైడు కాలువల నిర్మాణం సగంలో వదిలేశారు. రోడ్డు పొడవునా ఇసుక, కంకర కుప్పలు ఆటంకంగా ఉంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఇలాంటి పరిస్థితి ఉండటంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

మాలవ్యాజీ స్కూల్‌ను బాగుచేస్తాం

ఇన్‌చార్జి జేసీ, కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ కాలనీలోని మాలవ్యాజీ స్కూల్‌ను బాగుచేసి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. స్కూల్లోకి ఊట నీరు, మురుగునీరు వస్తుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో శుక్రవారం ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. నాలుగేళ్ల క్రితం స్కూల్ దగ్గరలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం, ఇతర నివాస భవనాలు నిర్మించడం వలన అక్కడ ప్రవహించే నీరు స్కూల్లోని తరగతి గదులలో ఊటగా ఏర్పడుతోందని స్కూల్ సిబ్బంది తెలిపారు. సంవత్సరం క్రితం ఈ సమస్య ఉండగా మరమ్మతులు చేసి, పూర్తిగా అరికట్టినా ఇప్పుడు మళ్లీ మరోచోట వస్తోందని వివరించారు. ఈ క్రమంలో రూ.9.90 లక్షలతో పనులు ప్రారంభించామని, ఐదు రోజుల్లో పూర్తి చేసి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చేస్తామని తెలిపారు. కమిషనర్ వెంట డీఈ మధు, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో మత్స్యశాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మత్స్యకారులు, ఆక్వా రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందే అవకాశాలను అధికారులు వివరించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని వివరించారు. అనంతరం ఉత్తమ గ్రామ మత్స్య సహాయకులు, సాగరమిత్రలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లు, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు టీఎన్ఎస్ఎఫ్ పాలాభిషేకం చేసింది. ఎస్వీయూ మెయిన్ గేట్ వద్ద శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 136 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులతో 10 లక్షల ఉద్యోగాలను ఇచ్చేందుకు తోడ్పడ్డారని కొనియాడారు. గూగుల్, రిలయన్స్, అమెజాన్, టాటా, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ వంటి అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ ఎస్వీయూ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్ నాయుడు, మహిళా అధ్యక్షురాలు కుసుమ, గంగాధర్, తెలుగు యువత నేత రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపు యజమాని ఆత్మహత్య



చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు

రామచంద్రాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయల చెరువులో దూకి మెడికల్ షాపు యజమాని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి కొర్లగుంటకు చెందిన కె.భాస్కర్(45) మెడికల్ షాప్ నిర్వహిస్తున్నాడు. భార్య కుమారి టైలరింగ్ షాపులో పనిచేస్తోంది. మద్యానికి బానిసైన భాస్కర్ తరచూ వస్తువులను పోగొట్టుకునేవాడు. గురువారం ద్విచక్ర వాహనాన్ని పోగొట్టుకుని ఇంటికెళ్లాడు. 'మద్యం తాగడం మానేస్తే ఇలాంటి పరిస్థితి ఉండదు కదా' అంటూ కుటుంబ సభ్యులు చీవాట్లు పెట్టారు. మనస్తాపానికి గురైన భాస్కర్ రాయలచెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం చెరువులో తేలుతున్న శవాన్ని గుర్తించిన జాలర్లు పోలీసులకు తెలిపారు. వారు మృతదేహాన్ని బయటకు తీయించి, వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్ పెట్టారు. గుర్తించిన భాస్కర్ కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బోరున విలపించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఎస్ఐ భక్తవత్సలం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సద్గురు మలయాళస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మంగళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యాసాశ్రమ శత వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పేడు మండలం సీతారామాపురం గ్రామం - వెంకటగిరి కూడలి వద్ద మహర్షి సద్గురు మలయాళస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ సద్గురు మలయాళస్వామి స్థాపించిన వ్యాసాశ్రమంలో విద్యను అభ్యసించిన తాము ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసేందుకు నిర్ణయించుకున్నామన్నారు. శనివారం ఏర్పేడులో స్వామివారి విగ్రహాన్ని ఊరేగించి ఆదివారం ఉదయం 10గంటలలోపు ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి బలరాంరాజు, కోశాధికారి రామయ్య, కార్యవర్గ సభ్యుడు రంగయ్యనాయుడు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన

తిరుచానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శిల్పారామంలో కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. తిరుపతికి చెందిన శ్రీనివాసరావు బృందం పలు అన్నమయ్య కీర్తనలకు చేసిన నాట్య ప్రదర్శన నగరవాసులను మంత్రముగ్ధులను చేసింది. కళాకారులను శిల్పారామం ఏవో సుధాకర్ ఘనంగా సత్కరించారు.



తహసీల్దార్ కార్యాలయంలో

సిబ్బంది కొరత

పనిభారంతో సతమతం



అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

తిరుపతి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సిబ్బంది కొరత ఏర్పడింది. ఏడాదిన్నరగా డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉంది. రెండు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టుల్లో ఎవరూ లేరు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో మిగిలిన డీటీలు, వీఆర్వోలపై పనిభారం పడుతోంది. ఉదయం 10.30 గంటలకు విధులకు హాజరైతే రాత్రి 8.30గంటల వరకు కార్యాలయంలోనే గడపాల్సిన పరిస్థితి నెలకొంది. కోర్టు వ్యవహారాలు, ప్రోటోకాల్, భూ ఆక్రమణలపై పర్యవేక్షణ, సర్టిఫికెట్స్, వాతావరణ మార్పులతో ఏర్పడే నష్టాలు, పీజీఆర్ఎస్, జీతాలు, ఇతర బిల్లుల తయారీ వంటి పనులతో మిగిలిన సిబ్బంది సతమతమవుతున్నారు. ఈ కారణంగా ప్రజలకు సకాలంలో సేవలందించలేకపోతున్నారు. ఒక్కో సమయంలో సహనం కోల్పోయి అర్జీదారులపై మండిపడుతున్నారు. పక్కనే ఉన్న రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పూర్తిస్థాయిలో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఏడాదిగా ఇదే పరిస్థితి ఉందని, ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

హోరాహోరీగా బేస్‌బాల్ ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అండర్ 17 బాలుర, బాలికల జట్లు

తిరుపతి(క్రీడలు), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి దాదాపు 300మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ప్రతిభ కనబరిచిన 64 మంది బాలబాలికలను ఎంపిక చేశారు. ఇందులో అండర్ 17 బాలబాలికలు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు కర్నూలు జిల్లా అహోబిలంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. అండర్ 14 వారు చిత్తూరు జిల్లా పలమనేరులో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు జరిగే పోటీలలో పాల్గొననున్నారు. క్రీడాకారులను హెచ్ఎం కేశవులనాయుడు, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ కిషోర్, బాబు, నాగరాజు, పీడీలు సురేష్, రూపలత, లోకేశ్, జయచంద్ర, రవీంద్రారెడ్డి, శశిప్రకాష్, సురేష్, నూరుద్దీన్, స్కూల్‌గేమ్స్ మాజీ కార్యదర్శి బాబు అభినందించారు.

మామిడి రైతులకు బిల్లులు ఇప్పించండి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులకు గుజ్జు పరిశ్రమల నుంచి బిల్లులు ఇప్పించాలని రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు టి.జనార్దన్ కోరారు. పరిశ్రమల నుంచి బిల్లులు రాక, ప్రభుత్వం ప్రకటించిన రాయితీ అందక రైతులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మామిడి రైతులు ఆందోళనలు చేసిన సమయంలో ప్రభుత్వం నుంచి కిలోకు 4రూపాయలు సబ్సిడీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి మరిచిపోయిందన్నారు. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు కిలోకు 8 రూపాయలు ఇస్తామని ప్రకటించారని, అయితే నేటివరకు రైతుల ఖాతాలో ఒక రూపాయి కూడా జమ చేయలేదని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు గుజ్జు పరిశ్రమల యజమానులతో కుమ్మక్కై బిల్లులు చెల్లించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకపోతే డిసెంబరు 11వ తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పరిశోధనల్లో ప్రమాణాలు పెంచండి

ప్రొఫెసర్లకు ఎస్వీయూ వీసీ నరసింగరావు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ నరసింగరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిశోధనల్లో ప్రమాణాలను పెంపొందించేలా ప్రొఫెసర్లు పని చేయాలని ఎస్వీయూ వీసీ నరసింగరావు సూచించారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రొఫెసర్లతో తొలిసారిగా ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. విద్యార్థులుంటేనే యూనివర్సిటీ ఉంటుందన్నారు. వారికి మంచి బోధన చేసి, పరిశోధనలు చేయించాల్సిన బాధ్యత ప్రొఫెసర్లపై ఉందని గుర్తు చేశారు. అన్ని విభాగాల్లో తనిఖీలు చేపడతానని స్పష్టం చేశారు. యూనివర్సిటీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. సకాలంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలు ఇచ్చేలా చూస్తామన్నారు. ప్రొఫెసర్ల బయోడేటా, పేటెంట్లు, సైటేషన్లు, ట్విట్టర్, సోషల్ మీడియాలో అనుసంధానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సీడీసీ డీన్ చెంగ్రాయుడు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న మల్లికార్జున్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏపీబీసీ స్టడీ సర్కిల్‌లో డిజిటల్ లైబ్రరీని శుక్రవారం బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జున్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, జ్యోత్స్న పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అనారోగ్య బాధితులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తన నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మధురానగర్‌కు చెందిన రాకేష్‌కుమార్‌కు రూ.3.26లక్షలు, వెన్నెలరాయల్‌కు రూ.94వేలు, కాకర్ల వినయ్‌కు రూ.65వేలు, ఎల్‌బీసీ రోడ్డుకు చెందిన వి.చందనకు రూ.1.10లక్షలు, లక్ష్మీనగర్‌కాలనీకి చెందిన రూ.84,928 అందజేశారు. బాధితులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ పర్యటన

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్(శరత్‌చంద్ర) శనివారం జిల్లా పర్యటన నిమిత్తం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం రాత్రి తిరుపతికి చేరుకుని ఎస్వీ యూనివర్సిటీ అతిథిగృహంలో విడిది చేస్తారని పేర్కొన్నారు. 23న తిరుపతిలోని తెలుగు అకాడమీ రీజనల్ సెంటర్‌ను సందర్శిస్తారని, సాయంత్రం తిరుమలకు చేరుకుని 24న ఉదయం స్వామివారిని దర్శించుకుంటారని పేర్కొన్నారు. 11 గంటలకు మహిళా వర్సిటీ వీసీ, 12 గంటలకు జాతీయ సంస్కృత యూనివర్సిటీ రిజిస్ట్రార్‌తో సమావేశమవుతారని తెలిపారు. సాయంత్రం 4గంటలకు ఎస్వీ యూనివర్సిటీ వీసీతో సమావేశం నిర్వహించి, రాత్రి నెల్లూరుకు బయలుదేరుతారని పేర్కొన్నారు.

ఓబీసీ మహిళలకు న్యాయం చేయాలి

మంగళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ఓబీసీ మహిళలకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, తిరుపతి నగర మహిళా అధ్యక్షురాలు యశోద కోరారు. ఈ మేరకు ఈ నెల 25న పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగే ఒక్కరోజు దీక్షను జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ బీసీ మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్రం ఓబీసీలకు ఎంత శాతం ఇస్తారనేది తేల్చాలన్నారు. బీసీ మహిళలకు సబ్ కోటా ఇస్తూ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరణ చేసిన తర్వాత మహిళా బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో నిర్వహించనున్న దీక్షలో పెద్ద సంఖ్యలో ఓబీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, జిల్లా ఉపాధ్యక్షుడు మధు ఆచారి, విద్యార్థి నాయకులు వాసు, చిరంజీవి, గోపాల్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాసుదేవయాదవ్



వాసుదేవయాదవ్‌ను అభినందిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ బీసీ విభాగం జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తిరుపతి టౌన్‌బ్యాంకు వైస్ చైర్మన్ వాసుదేవ యాదవ్ నియమితులయ్యారు. ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఆయన వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించనున్నారు. శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి భూమన అభినయ్‌ను కలిసి సత్కరించారు.

స్వాగత, వీడ్కోలు సభల రద్దు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో జూనియర్, సీనియర్ విద్యార్థులు నిర్వహించుకునే స్వాగత, వీడ్కోలు సభలను రద్దు చేశారు. ఏ విభాగంలోనూ నిర్వహించకుండా చూడాలని విభాగాధిపతులను ఆదేశిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.



గాంధీ రోడ్డులో కురుస్తున్న వర్షం



గోవిందరాజస్వామి ఆలయం వద్ద..

తిరునగరిలో జోరువాన



ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రయాణికుల ఇక్కట్లు

తిరుపతి అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో శుక్రవారం ఉదయం నుంచి పలుమార్లు వర్షం కురిసింది. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా అప్పుడప్పుడూ తేలికపాటి వర్షం కురిసినా శుక్రవారం ఎక్కువైంది. ఉదయం చిరుజల్లుతో కూడిన వర్షం కురిసి ఆగిపోయింది. ఆ తర్వాత సూర్యప్రతాపం యథావిధిగా కొనసాగింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. రాత్రి వరకు అప్పుడప్పుడూ తేలికపాటి వర్షం పడింది. ఆర్టీసీ బస్టాండు, రైల్వే అండర్ బ్రిడ్జిలు, కూరగాయల మార్కెట్, లోతట్టు కూడళ్లు, ప్రాంతాలు జలమయమయ్యాయి. వీధుల్లో మురుగునీటి ప్రవాహం కనిపించింది. మట్టిరోడ్లు మరింత ఛిద్రమయ్యాయి. గుంతల్లో నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బందిపడ్డారు. తిరుమల కొండను పొగమంచు కప్పేసింది. మాలాడిగుండం, కపిలతీర్థం జలపాతాలు పుంజుకున్నాయి. ప్రకృతి అందాలు చూపరులను ఆకట్టుకున్నాయి. రాత్రిపూట చలి పెరిగింది. విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలకు ఇబ్బందులు తప్పలేదు.



తిరుచానూరు అమ్మవారి ఆలయం వద్ద భక్తుల అవస్థలు

కనువిందుగా వసంతోత్సవం





అమ్మవారు ఊరేగుతుంటే.. అర్చకులు, అధికారులు వసంతాన్ని చల్లుతుంటే.. భక్తుల గోవింద నామస్మరణలతో తిరుచానూరు ఆలయ తిరుమాడవీధులు ప్రతిధ్వనించాయి. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారిని స్వర్ణకమల తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లూతూ వసంతోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. జోరు వర్షంలోను అమ్మవారి వాహన సేవ జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సహస్ర లక్ష్మీకాసులహారం శోభాయాత్ర

పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే సహస్ర లక్ష్మీకాసులహారం శుక్రవారం పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరింది. గజవాహన సేవలో ఈ హారాన్ని అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవారి ఆలయం నుంచి అదనపు ఈవో వెంకయ్య చౌదరి లక్ష్మీకాసుల హారాన్ని అలిపిరికి తీసుకొచ్చారు. అక్కడ్నుంచి శోభాయాత్రగా జేఈవో వీరబ్రహ్మం, ఇతర అదికారులతో కలిసి మండపానికి తీసుకొచ్చారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆ కాసుల హారాన్ని అర్చకులకు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ అమ్మవారి ఆలాయానికి హారాన్ని తీసుకొచ్చి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజ వాహనసేవలో ఉత్సవమూర్తికి ఈ సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని ధరింపచేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శోభాయాత్రలో పాల్గొన్న టీటీడీ ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు

నృత్య సంబరం.. అమోఘం

అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పల్లకీ సేవ, రాత్రి గజవాహన సేవ ముందు కళాకారుల నృత్య సంబరం అమోఘంగా సాగింది. వివిధ రాష్ట్రాల కళాకారులు మాడవీధుల్లో ప్రదర్శించిన నృత్యం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. తీన్‌మార్ డ్రమ్స్, రింగ్ ఫిజన్, ట్రైబల్ డ్యాన్స్, కోలాటాల ప్రదర్శనలు భక్తులు ఆకర్షించాయి.ఉదయం నూజివీడుకు చెందిన అమరావతి డ్రమ్స్ రాంబాబు బృందం తీన్‌మార్ డ్రమ్స్.. తణుకుకు చెందిన అంబిక డ్యాన్స్ అకాడమీకి చెందిన 20మంది కళాకారుల రింగ్ ప్యూజన్ నృత్యం, నూజివీడు లాలేశ్వరరావు బృందం చెక్క భజనలు, కొవ్వూరుకు చెందిన శివరామకృష్ణ బృందం ట్రైబల్ డ్యాన్స్ భక్తులను కనువిందు చేశాయి. తిరుపతికి చెందిన హరిత బృందం పలు దేవతా మూర్తులు, డాక్టర్ మురళీకృష్ణ బృందం నవదుర్గలు, అష్టలక్ష్మి వేషధారణ భక్తులను మైమరిపించాయి. చిత్తూరుకు చెందిన వాణిశ్రీ బృందం, పొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి బృందం, రైల్వే కోడూరుకు చెందిన సుజన కోలాటాలు అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి











శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 4 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.61 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,839

తలనీలాలు సమర్పించినవారు: 19,220

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా



బస్సును పక్కకు తొలగిస్తున్న క్రేన్

- ఆరుగురికి గాయాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం దొడ్లవారిమిట్ట వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విజయవాడ నుంచి 21 మంది ప్రయాణికులతో బెంగళూరుకు వెళ్తున్న బస్సు దొడ్లవారిమిట్ట వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురానికి చెందిన శ్రీనివాసులు, ఏలూరుకు చెందిన శ్రీనివాసులు, గుంటూరుకు చెందిన తోరటి మల్లీశ్వరి, ఎం.అంజమ్మ, షణ్ముగనాధ్, ఈశ్వర్‌రావు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు క్రేన్ సాయంతో బస్సును రోడ్డుపై నుంచి పక్కకు తొలిగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన జర్నలిస్ట్ శ్రీనివాసులు
- విచారణ నేటికి వాయిదా

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరకామణిలో చోరీ వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు కోరుతూ పిటిషన్ వేసిన తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు దాఖలు చేసిన పిటిషన్ పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ అభ్యర్థనపై అభిప్రాయాన్ని చెప్పాలని సీఐడీని ఆదేశించింది. వ్యాజ్యం పై తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.పరకామణి చోరీ వ్యవహారం సీఐడీ విచారణకు ఆదేశించాలని పిటిషనర్‌కు బెదిరింపులు వస్తున్నాయని, భద్రత కల్పించాలని కోరుతూ ఈనెల 15న వినతి సమర్పించినా పోలీసుల నుండి ఎలాంటి స్పందన లేదని జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తు ముగిసేవరకు భద్రత కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు.

పోటెత్తిన భక్తులు

- సాయంత్రానికే గ్యాలరీల్లో నిండిన భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుచానూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో శుక్రవారం రాత్రి జరిగిన పద్మావతి అమ్మవారి గజ వాహన సేవకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం 6.45 గంటలకే భక్తులతో గ్యాలరీలు నిండిపోయాయి. మాడవీధుల్లో భక్తులు కిక్కిరిసి ఉన్నారు వెలుపల ప్రధాన మార్గం వరకు భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది. ఇక, గేట్ నెంబర్ 2ను సాయంత్రం 6.30గంటలకు మూసేయడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎమ్మెల్యేపులివర్తి నాని హారతి పాయింట్ ఉన్న ప్రతిగేట్ వద్ద విజిలెన్సు సిబ్బందికి తొక్కిసలాటలు లేకుండా సూచనలు సలహాలు ఇచ్చారు. ఆంజనేయస్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో స్థానికులు రావడంతో కాస్త తోపులాట జరిగింది. రాత్రి 10.20 గంటలకు అమ్మవారి గజ వాహనం.. గంగుండ్ర మండపం వద్దకు చేరింది. చిన్న చిన్న ఘటనలు మినహా వాహన సేవ ప్రశాంతంగా ముగిసింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషి, ఎస్పీ తదితరులు

పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు

తిరుచానూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన 25వ తేది జరిగే పంచమి తీర్థానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అడిషనల్ డీజీపీ మధుసూదన్‌రెడ్డి, అనంతపురం రేంజీ డీఐజీ షిముషీ, ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పంచమి తీర్థం ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం, పుష్కరణి పరిసరాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. స్నానాలు చేసే భక్తుల భద్రత దృష్ట్యా పుష్కరిణిలో లైఫ్‌గార్డులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, పోలీసు డైవర్స్, విజిలెన్సు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీలు వెంకట నారాయణ, ప్రసాద్, గిరిధర్, టీటీడీ విజిలెన్సు అధికారులు పాల్గొన్నారు.

కారు కనిపిస్తే రాళ్లేస్తాడు

- తిరుపతిలో మానసిక రోగి విధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అతడికి మానసిక స్థితి సరిగాలేదు. కార్లు కనిపిస్తే చాలు.. వాటిపై రాళ్లు వేసి ధ్వంసం చేస్తున్నాడు. గతంలో కారు ఘటన ఏదో ఇతడిని కలవరానికి గురి చేయడమే కారణమని అలిపిరి పోలీసులు అంటున్నారు. ఇలా దాడికి పాల్పడే వ్యక్తిది తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి. తల్లిదండ్రులతో కలిసి మంగళంలో ఉంటున్నాడు. శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో ఫుల్లుగా మద్యం తాగి.. తిరుపతి నగరం మధురానగర్‌లోకి వచ్చాడు. ఓ ఇంటి ముందు ఆపి ఉన్న కారుపై బండరాళ్లు వేసి ధ్వంసం చేశాడు. ఆ తర్వాత దుకాణాలపైన రాళ్లు విసిరాడు. దీంతో ఐదారు దుకాణాల తలుపులు, షట్టర్లు దెబ్బతిన్నాయి. ఈ రాళ్ల దాడిలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. ఈ విధ్వంసాన్ని గమనించిన సీపీఎం నేత కందారపు మురళి అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. అలిపిరి ఎస్‌ఐ అజిత, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. మానసిక రోగి కావడంతో విచారించి అతడి తల్లితండ్రులకు అప్పగించామని పోలీసులు చెప్పారు.

తరచూ ఇలాంటి ఘటనలే

ఈ మానసిక రోగే అని కాదు.. మధురానగర్‌లో పలుమార్లు తాగుబోతులు కూడా ఇలాంటి విధ్వంసాలకే పాల్పడ్డారు. ఆరు నెలల కిందట ఇక్కడ నివాసమున్న ఇద్దరు ఫొటో జర్నలిస్టుల ద్విచక్ర వాహనాలను అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని మందుబాబులు బండ రాళ్లతో ధ్వంసం చేశారు. వినాయక ఆలయం వద్దనున్న రెండు మున్సిపల్ కాంప్లెక్సుల వద్ద రాత్రి 10 గంటలైతే చాలు కొందరు బహిరంగంగా మద్యం తాగుతూ దారిన పోయేవాళ్లను వ్యంగ్యంగా మాట్లాడుతున్నట్లు స్థానికులు చెప్పారు. దీంతో ఆ దారిన వెళ్లాలంటే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు స్పందించి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం)/భాకరాపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల చొప్పున జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ మైలావాండ్లపల్లెకి చెందిన వి.శ్రీనివాసులు, వి.జయచంద్ర శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికి.. దుంగలను డంపింగ్ ప్రాంతాలకు చేర్చేవారు. ఆ తర్వాత వాటిని తమిళనాడులోని స్మగ్లర్లకు అమ్మేవారు. ఈ క్రమంలో 2014లో వీరు ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నారనే సమాచారంతో అప్పటి భాకరాపేట ఎస్‌ఐ నెట్టికంఠయ్య, సిబ్బంది కలసి దాడులు చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనిపై పలు దఫాలుగా కేసు విచారణ జరిగింది. అనంతరం తిరుపతి ఎర్రచందనం కోర్టుకు కేసును బదిలీ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితులకు ఏడాది పాటు జైలు శిక్ష, రూ.10,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా, స్మగ్లర్లకు శిక్ష పడడానికి కృషి చేసిన చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ, ప్రస్తుత సీఐ ఇమ్రాన్ బాషా, ఎస్‌ఐ రాఘవేంద్ర, అప్పటి ఎస్‌ఐ నెట్టికంఠయ్య, కోర్టు లైజనింగ్ హెడ్ కానిస్టేబుల్ హరినాథ్, కోర్టు కానిస్టేబుల్ నరసింహులును టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీవారి సేవలో హోం మంత్రి అనిత



తిరుమల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

సోషల్ మీడియాలో ఇళయరాజా ఫొటో వాడొద్దు

- మద్రాస్ హైకోర్టు ఆదేశం

చెన్నై, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత స్వరకర్త 'ఇసైజ్ఞాని' ఇళయరాజా ఫొటోను సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి నెట్‌వర్కింగ్ సైట్లలో ఉపయోగించడంపై మద్రాస్ హైకోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. ఈ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో తన అనుమతి లేకుండా తన ఫొటోను ఉపయోగించడాన్ని నిషేధించాలని కోరుతూ ఇళయరాజా హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీ సాయంతో తన ఫొటోను మార్ఫింగ్ చేసి వాణిజ్యపరంగా వినియోగిస్తూ ఆదాయాన్ని అర్జిస్తున్నారని, ఇది తన వ్యక్తిగత హక్కులను హరించే చర్య అని పేర్కొన్న ఇళయయరాజా..ఇకపై తన అనుమతి లేకుండా ఎవ్వరూ ఉపయోగించకుండా ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆయన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం.. ఇళయరాజా ఫొటోలను ఆయన అనుమతి లేకుండా సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లలో తాత్కాలికంగా ఉపయోగించరాదని స్పష్టం చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలుస్తోందని మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మన శ్రీధర్ అన్నారు. శుక్రవారం మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని మత్స్యకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారులకు వలలు, సైకిళ్లు, రాయితీపై డీజిల్ అందించగా, వైసీపీ ప్రభుత్వం వాటన్నింటిని నిలిపివేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని పునరుద్దరించేలా చర్యలు తీసుకుందన్నారు. మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు బొమ్మన పళణి, కోడిపర్తి శ్రీధర్, పులికాట్ మత్స్యకారుల సంక్షేమ సంఘం నాయకులు సుధాకర్, సుందరమూర్తి, ఏకాంబరం, స్వామియార్, దేశప్పన్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

పుత్తూరు అర్బన్, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన డి.వి.నాగేశ్వరరావు సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారు. రెండు రోజుల క్రితం కమిషనర్ సచివాలయాల్లో తనిఖీలు చేపట్టారు. ఆరేటమ్మ కాలనీ, ఆర్టీసీ కాలనీలకు సంబంధించిన సచివాలయాల్లో ఇద్దరు హెల్త్ సెక్రటరీలో మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా వీల్లుకు వెళ్లినట్లు ఇతర సిబ్బంది చెప్పారు. దీంతో ఆగ్రహించిన కమిషనర్ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీనిపై వారు వివరణను ఇచ్చారు. మొదటి తప్పుగా పరిగణించి చర్యల నుంచి మినహాయించారు.

పారిశుధ్య నిర్వహణపై మండిపాటు

పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని గేట్ పుత్తూరులో కాలువల్లో మురుగు ముందుకు సాగకపోవడంపై కమిషనర్ నాగేశ్వరరావుకు ఫిర్యాదులు అందాయి. శుక్రవారం సిబ్బందితో తనిఖీ చేశారు. సిల్టు పేరుకుపోయి ఉండడం గమనించారు. పారిశుధ్య సిబ్బందిపై మండిపడ్డారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వడమాలపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాలను ఎల్లప్పుడూ స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచుకువాలని గ్రామ, వార్డు, సచివాయాల జిల్లా అధికారి నారాయణ రెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని పాదిరేడులో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణ, పచ్చదనం, పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా వీధులను శుభ్రపరిచారు. పంచాయతీ కార్మికులకు, గ్రీన్ అంబాసిడర్లకు శుభ్రతపై శిక్షణ ఇచ్చారు. టీడీపీ నాయకులు దాముయాదవ్, ధనంజయులు నాయుడు, భాస్కర్ నాయుడు, చందు, ఎంపీడీవో శేషగిరిరావు, డిప్యూటీ ఎంపీడీవో కిషోర్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు విజయ్‌భాస్కర్, మోహనరావు సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

వడమాలపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండలంలోని ఉన్నతపాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వాటిల్లో విజేతలకు బహుమతులు అందించారు. అలాగే బాలల హక్కులపై ఐసీడీఎస్, విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించారు.

అప్లికేషన్స్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ ఆధ్వర్యంలో మూడు నెలల అప్లికేషన్స్ డెవలపర్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చంద్రమౌళి చెప్పారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, 40 ఏళ్ల లోపు ఔత్సాహికులు అర్హులన్నారు. ఈ నెల 28వ తేదీలోగా ఆధార్ కార్డు, మార్కుల జాబితా జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు నెం. 6300954441లో సంప్రదించవచ్చు.

హిమజలో ఘనంగా సెవన్ వండర్స్



గ్రేట్ వాల్ ఆఫ్ చైనా నమూనాతో విద్యార్థులు

పుత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమజ విద్యాసంస్థలో వరల్డ్ సెవెన్ వండర్స్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో తిరుమల రాజు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులలో ఆలోచనాశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ2 బాలసుబ్రమణ్యం, విద్యా సంస్థ ఛైర్మన్ సురేంద్రరాజు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

పుత్తూరు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లకండ్రిగకు చెందిన శతాధిక వృద్ధురాలు నల్లకుక్కల రాజమ్మ స్వర్గస్తులయ్యారు. 102 సంవత్సరాల రాజమ్మ శుక్రవారం మృతి చెందారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య ఆమెకు నివాళులర్పించారు. కటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పంటల బీమా అందేలా చర్యలు



టి.సి. అగ్రహారం రైతులతో అధికారులు

వడమాలపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పంటలకు కేంద్ర ప్రభుత్వం అందేజేసే బీమా నిధులు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర వ్యవసాయ సంయుక్త కార్యదర్శి ముక్తానంద్ అగర్వాల్ చెప్పారు. శుక్రవారం మండలంలోని టి.సి. అగ్రహారంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పంటల బీమా నిధులు ఖాతాల్లో జమ అయ్యే విధివిధానాల్లో రైతుల సలహాలివ్వాలని కోరారు. నష్టపోయిన రైతులందరికీ బీమా అందిస్తామని చెప్పారు. వరదలకు నష్టపోయిన రైతులకు కూడా బీమాయోజన ద్వారా నిధులు అందించేలా మార్పులు చేస్తామని చెప్పారు. బీమా పథకం జే.డి.వేణుగోపాల్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, పుత్తూరు వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మీదేవి, ఏవో విజయ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం



శిక్షణ కార్యక్రమంలో సూచనలిస్తున్న అధికారులు

పుత్తూరు టౌన్, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తామని తిరుపతి డీఏవో ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పెన్షనర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో పుత్తూరు డివిజన్ ఆర్ఎస్‌కే క్షేత్ర సిబ్బందికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమంలో డీఏవో ప్రసాద్, ఏడీఏ ధనంజయ రెడ్డి... రసాయన ఎరువులు, కీటక నాశనాల కారణంగా తలెత్తే అనర్థాలను వివరించారు. అలాగే నేల జీవులను రక్షించే పద్ధతులు, మల్చింగ్ ప్రయోజనాలు, పంటల మధ్య విశ్రాంతి, మిశ్రమ పంటలు, జీవామృతం, కషాయాల తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. డీపీఎం షణ్ముగం, మండల ఏడీఏ లక్ష్మీ, పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం ఏవోలు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

కుటుంబ కలహాలతో

లారీ డ్రైవర్ ఆత్మహత్య

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో లారీ డ్రైవర్‌గా ఆత్మహత్య పాల్పడ్డాడు. తమిళనాడు విల్లాపురానికి చెందిన చంద్రశేఖరన్(46) తడ మండల పరిధిలోని పూడి గ్రామం వద్ద ఉన్న ఒక స్రాప్ యార్డ్‌లో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి సమయంలో అక్కడే పనిచేసే మరో డ్రైవర్‌కు ఫోన్‌చేసి కుటుంబ కలహాల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా చెప్పాడు. ఆ డ్రైవర్ వెంటనే చంద్రశేఖరన్ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. కుటుంబసభ్యులు గాలించినా కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. డంపింగ్ యార్డ్ సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలు విన్నవించే సమస్యలను సంబంధిత శాఖ అధికారులు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు అందజేసే అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ విజన్ యాక్షన్‌ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మన జిల్లాలో గూడూరులో మొట్టమొదటిగా ఈ కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆన్‌లైన్ ద్వారా సీఎం డాష్‌బోర్డుకు పంపడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రెవెన్యూశాఖకు సంబంధించి ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, ప్రభుత్వ భూములను కొంతమంది ఆక్రమణలకు గురి చేస్తున్నారని, ఇటువంటివి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రావు, తహసీల్దారు ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, దుద్దా రాఘవరెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: కురుగొండ్ల



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి వినతినీ పరిష్కరించే వరకు తాను పర్యవేక్షిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా, తహసీల్దారు నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, అన్నిశాఖల అధికారులు, టీడీపీ నాయకలు పాల్గొన్నారు.

నగర వనం పనులను త్వరగా పూర్తి చేయండి



నగర వనాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సాయిబాబా

వెంకటగిరి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో అసంపూర్తిగా ఉన్న నగర వనం పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) సాయిబాబా ఆదేశించారు. శుక్రవారం ఆయన నగర వనాన్ని పరిశీలించారు. కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా ప్రకృతిని ప్రతిబింబించేలా నగర వనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ పచ్చదనం ఉండేలా మొక్కలు నాటాలని, ఆడిటోరియంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలన్నారు. వాష్‌రూంలను ముఖద్వారాల్లో కాకుండా దూరంగా ఏర్పాటు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కలు నాటకుండానే బిల్లులు మంజూరు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో రెండు నెలల్లో మళ్లీ నగర వనాన్ని సందర్శిస్తానని, అప్పట్లోగా పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్‌వో శ్రీకాంత్, రేంజర్ రమణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ జీవనోపాధి కల్పనే క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణరెడ్డి

ఓజిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శుభ్రత, హరిత, సుపరిపాలన, అభివృద్ధితో పాటు అందరికీ జీవనోపాధులు కల్పించడమే క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ లక్ష్యమని ఎంపీడీవో నారాయణరెడ్డి అన్నారు. ఓజిలి మండలం కురుగొండలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్యం పచ్చదనంతో పాటు మెరుగైన జీవనోపాధులు, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, సామాజిక న్యాయం వంటి అంశాలను వివరించారు. అనంతరం సంపద యారీ కేంద్రం వద్ద ప్రత్యేక సమావేశం, వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రేణుక, సొసైటీ అధ్యక్షుడు దారా అంకయ్య, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి కావ్య, సీహెచ్‌వో సుబ్బరామయ్య, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి

బీరువా వితరణ



ఆలయానికి బీరువాను అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

చిల్లకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చిల్లకూరులోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ముత్తురాజు దాతృత్వంతో బీరువా వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆలయంలోని స్వామివారి వస్త్రాలు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రి భద్రపరుచు కునేందుకు బీరువా అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అక్కన రమణయ్య, రవిచంద్ర, వీరేంద్రనాథ్, శ్రీనివాసులురెడ్డి, శివయ్య, రూపేష్, రామ్మోహన్‌రావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ అప్రమత్తతపై సమీక్ష

దక్కిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మరో తుఫాన్ ముప్పు పొంచి ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై తహసీల్దారు శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. వీఆర్వోలు, వీఆర్‌ఏలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ఎలాంటి సమస్య ఉన్నా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. చెరువులు నిండిపోవడంతో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇక విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా లైన్‌మన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సూళ్లూరుపేట(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. తుఫాన్ ప్రభావంతో శనివారం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయట ప్రాంతాలకు వెళ్లరాదన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని చెప్పారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. సెన్‌యార్ తుఫాన్ ప్రభావంతో 21నుంచి 24వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే కంట్రోల్ రూం నెం.9492099404కు ఫోన్ చేయాలని సూచించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు కురిసి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 9989502068, 9701227914 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తహసీల్దారు జయ జయరావు కోరారు. మండలంలోని గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం సముద్రతీరంలో మూడు రోజులపాటు చేపల వేట నిషేధించారు.

బాలల హక్కులపై అవగాహన

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, చెందోడు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది నగ్మ, సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో బాలికలకు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

27, 28 తేదీల్లో సీపీఐ శిక్షణ తరగతులు

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ శ్రేణులకు ఈనెల 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్న పెంచలయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పల్లెపాటి బాలకృష్ణయ్య, దక్కిలి శివకుమార్, కచేపల్లి అంకయ్య, పైడిగండ్ల మునికృష్ణారెడ్డి, అరవ సాయి, ఎం మునీంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

ఆధార్ సేవలను

సద్వినియోగం చేసుకోండి

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అక్కంపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సోమవారం వేనాడు, మంగళవారం బీవీపాళెం పాఠశాలల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, విద్యార్థులు ఆధార్‌లో తప్పొప్పులను సరిచేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఆయనవెంట విద్యాశాఖ సిబ్బంది గోపీనాథ్, బాలాజీ ఉన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో పేపళ్ల అమరయ్య నాయుడు దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు. కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, రాము, రాంబాబు, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

వెంకటగిరి టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు హార్టికల్చర్ అధికారి ఆనంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కూరగాయల సాగుకు ప్రోత్సహించేందుకు ఆర్‌కేవీపై పథకం కింద పందిరి నిర్మాణానికి ఎకరాకు రూ.లక్ష రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు.

సముద్రం అల్లకల్లోలం

వాకాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తూపిలిపాళెం సముద్రతీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మండల కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. వీఆర్వోలతో పాటు, ఇతర సిబ్బందిని విధుల్లో ఉండి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందజేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా 08624-221024 నెంబరును సంప్రదించాలన్నారు.

సీనియర్ పాత్రికేయుడు శీనారెడ్డి మృతి



శ్రీనివాసులురెడ్డి (ఫైల్‌ఫొటో)

తడ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి అలియాస్ శీనారెడ్డి(57) శుక్రవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దే వైద్య సంరక్షణలో ఉంటున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో కన్నుమూశారు. శ్రీనివాసులురెడ్డి సుమారు నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో ఉంటూ వివిధ దినపత్రికల్లో పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

ఇంటి రుచులతో భోజనం అందించండి

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇంటి రుచులతో ఆరోగ్యకరమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని నదీతీర పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సరిగా లేదని, ప్రశ్నించిన పిల్లలను, ఉపాధ్యాయులను నిర్వాహకురాలు దూషిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు కోడి గుడ్డు పెంకులతో నిండి దుర్గంధం వస్తుండడాన్ని గుర్తించిన ఆయన మధ్యాహ్న భోజన పథకం నిర్వహకురాలి తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. చాలీచాలకుండా అన్నం పెడుతోందని, అడిగితే అసభ్యంగా తిడుతోందని, కోడిగుడ్లు నీచు వాసన వస్తున్నాయని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఈ విషయాన్ని ఇన్ని రోజులు తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదంటూ ఎంఈవో బాబయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవోతో ఫోన్‌లో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. అప్పటికప్పుడు మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు లీలావతిని తొలగించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి భోజనం తెప్పించేందుకు ఎంఈవో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా, నాయకులు బీరం రాజేశ్వరావు, శివారెడ్డి, మంకు ఆనంద్ తదితరులు ఉన్నారు.

యూరియా కొరత లేదు

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలో యూరియా కొరత ఉందంటూ అసత్య ప్రచారం జరుగుతోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఖండించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత రానివ్వమని, రైతులు నిర్భయంగా వ్యవసాయ పనులు కొనసాగించాలంటూ కోరారు.

పేదలకు వరం అన్న క్యాంటీన్

వెంకటగిరి, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు అన్న క్యాంటీన్ వరం లాంటిదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను సందర్శించారు. భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి రుచి గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు.

పీఎంఎస్‌బీవై బీమా చెక్కు అందజేత



లక్ష్మీకి బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు చీఫ్ మేనేజర్ కరుణానిధి, ఏపీఎం ప్రసన్న తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పేదలకు వరం లాంటిదని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ కరుణానిధి అన్నారు మండల పరిధిలోని కొమ్మినేనిపల్లి గ్రామానికి చెందిన వేలూరు యుగంధర్ ఇటీవల మరణించాడు. ఆయనకు కెనరా బ్యాంకులో ఉండడంతో పీఎంఎస్‌బీవై బీమా చేసుకున్నారు. దీంతో ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన పథకం కింద రూ.2 లక్షల మంజూరైంది. శుక్రవారం మృతుడి భార్య లక్ష్మీకి బీమా చెక్కును చీఫ్ మేనేజర్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకులో ఖాతా ఉన్న వారం దరూ రూ.20 ప్రీమియం చెల్లిస్తే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శివ ప్రసాద్, వెలుగు ఏపీఎం ప్రసన్న, సీసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్

వాకాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ అన్నారు. మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్ పూజలు చేశారు. అనంతరం కేక్‌ను కట్ చేశారు. మత్స్యకారులను సన్మానించారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు ఆర్‌కేటీ మహేంద్ర, పామంజి గోవింద్, కాకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



సంపద తయారీ కేంద్రం వద్ద ఎంపీడీవో ప్రమీలారాణి, సిబ్బంది

పెళ్లకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఎంపీడీవో ప్రమీలారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో ఉన్న సంపద తయారీ కేంద్రంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భూషన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

సూళ్లూరుపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో పచ్చదనం.. పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలను పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం గ్రామాల్లో చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజా సేవకుడినే: ఎమ్మెల్యే ఆదిమూలం


అర్జీలపై అధికారులతో మాట్లాడుతున్న ఆదిమూలం

నారాయణవనం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజా సేవకుడిగా ఉంటానని ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం నారాయణవనం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం దినం సందర్భంగా ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు పరి ష్కరించాల్సిందిగా ఫోన్‌లోనే కోరారు. మొత్తం 240 వినతులను స్వీకరించారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పని చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

నాగలాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం నాగలాపురం వ్యాపార సంఘ కల్యాణ మండపంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నిధులతో సంబంధం లేని వినతులను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ప్రజా దర్బార్ వినతులు పరిష్కరించకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సురుటుపల్లి పంచాయతీ కస్తూరినాయుడు కండ్రిగ శ్మశాన వాటికకు దారి లేకపోవడంతో అరుణానది కాలువను దాటి వెళ్లాల్సి ఉందని, కాజ్‌వే ఏర్పాటు చేయాలని కోరారు. 197 వినతులు అందాయి. సమావేశంలో పళ్లికొండేశ్వర ఆలయ చైర్మన్ పద్మనాభరాజు, నాగలాపురం మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, నాయకులు సెల్వకుమార్, నమఃశివాయం, సుగ్రీవరెడ్డి, పార్తీబన్, బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలపై దృష్టి పెట్టండి


ఎంపీడీవోకు సూచనలిస్తున్న ఆర్డీవో

కేవీబీపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కళత్తూరులో ఇప్పటి వరకు ప్రభుత్వం అందించిన సహాయక చర్యల వివరాలను ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తహసీల్దార్ రోశయ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గ్రామంలో పర్యటించి వసతులు, పారిశుధ్యంపై ఎంపీడీవో మాలతిని ఆరా తీశారు. వీధుల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చేయాలన్నారు. అవసరమైతే రోజు విడిచి రోజు అయినా గ్రామంలో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. అనంతరం బాధితులతో మాట్లాడుతూ త్వరలోనే ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అందరికి అందిస్తామని తెలిపారు.

చేతి వృత్తులకు అండగా ఉంటా: సుధీర్


కలంకారీ వస్త్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చేతి వృత్తి కళాకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. ఏపీ టూరిజం పరిధిలో ఉన్న హస్తకళా కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. చేతివృత్తులు, చేనేత కళాకారులు, కొయ్యబొమ్మలు తయారు చేసే వారికి దళారులతో పనిలేకుండా స్వయంగా తమ ఉత్పత్తులను విక్రయించుకునే సౌకర్యం కల్పిస్తామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న హస్త కళల కేంద్రలో 10 ప్రత్యేక గదులను నిర్మించి వాటిని కళాకారులకు కేటాయిస్తామన్నారు.

● ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. ఊరందూరులోని తన స్వగృహంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. పరిష్కరించాలని సంబంధిత అధికారులను అక్కడికక్కడే కోరారు.

ఆరోగ్యంపై అవగాహన


విద్యార్థినులకు సూచనలిస్తున్న డాక్టర్ లక్ష్మీప్రసూన

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎంజీఎం ఆస్పత్రి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా రుతుక్రమ సమయంలో విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్త లను ఎంజీఎం ఆస్పత్రి గైనకాలజిస్టు లక్ష్మీ ప్రసూన వివరించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ డాక్టర్ మయూర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు ప్రతి కళాశాలలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వరరావు, కళాశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ


సౌట్లకు యూనిఫాం అందిస్తున్న హెచ్‌ఎం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కౌట్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ వస్తుందని బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణయ్య తెలిపారు. పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీఎంశ్రీ నిధులతో స్కౌట్ అండ్ గైడ్స్‌కు యూనిఫాం, వివిధ వస్తువులను కొనుగోలు చేశామన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ కెప్టెన్ జయశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలువలో పడి పాడిరైతు మృతి


జయరామయ్య

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పశువులను మేతకు తీసుకెళ్తూ ప్రమాదవ శాత్తు కాలువలో పడడంతో పాడిరైతు జయరామయ్య(70) మృతి చెందాడు. నారాయణపురానికి చెందిన జయరామయ్య రోజు లాగే శుక్రవారం ఉదయం పశువులను మేత కు తీసుకెళ్లే క్రమంలో గ్రామ సమీపంలోని ఈదులకాలువలో పడి గల్లంతయ్యాడు. కుటుంబసభ్యుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది గాలించారు. శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని అరవకొత్తూరు సమీపంలో మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హోలిస్టిక్ ప్రోగ్రెస్‌కార్డుల పరిశీలన



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సమగ్ర అభివృద్ధి పత్రాలను ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పరీక్షల మార్కులను హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేశామన్నారు. కార్డుల్లో విద్యార్థుల వ్యక్తిగత, ఆటల పోటీల వివరాలు, తదితర సమగ్ర సమాచారం ఉంటుందన్నారు. డిసెంబరు 5న జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్‌లో తల్లిదండ్రులకు వీటిని అందిస్తామన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం

రేణిగుంట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సెన్‌యార్ తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. తుఫాన్ విపత్తుకు సంబంధించిన సమస్యలను కంట్రోల్ రూం నెం.9010046456కు ఫోన్ చేసి తెలపవచ్చని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

టూరిస్ట్ బస్టాండులో కనీస సౌకర్యాల కరువు



వంట చేయడానికి ఇబ్బంది పడుతున్న అయ్యప్ప భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలోని టూరిస్టు బస్టాండులో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో పలు ప్రాంతల నుంచి శ్రీకాళహస్తికి అయ్యప్ప మాలధారణ భక్తులు సొంత వాహనాల్లో వస్తుంటారు. పార్కింగ్ ఫీజు వసూలుపై ఉన్న శ్రద్ధ వసతులు, సౌకర్యాలు కల్పించక పోవ డంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో అయ్యప్పస్వామి భక్తులు మురుగు గుంతల పక్కనే వంటలు చేసుకుని తినాల్సి వస్తోంది. శ్రీకాళహస్తికి వచ్చే అయ్యప్పస్వామి భక్తులు నిష్ఠగా భిక్ష చేయడానికి మంచి ప్రదేశం లేకపోవడంతో మురికిగుంతల పక్కనే చేయాల్సి వస్తోంది. దీనిపై అయ్యప్పస్వామి భక్తులు మాట్లాడుతూ... తాము అనేక పుణ్య క్షేత్రాలు దర్శించుకుంటూ వస్తున్నామని ఆయా దేవస్థానాలు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించా యన్నారు. కానీ శ్రీకాళహస్తీశ్వరాలయ టూరిస్టు బస్టాండులో మాత్రం పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నారు. ఆలయ అధికారులు స్పందించి వసతులు కల్పించాల్సి ఉందన్నారు. దీనిపై హిందూ ధార్మిక మండలి సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు విఫలమవుతన్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

హోంమంత్రికి వీడ్కోలు



పిచ్చాటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి పర్యటనలో భాగంగా తిరుపతికి వచ్చి తిరుగు ప్రయాణమైన హోంమంత్రి అనితను తిరుపతి విమానాశ్రయంలో శుక్రవారం సురుటుపల్లి ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు, తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడులు మర్యాదపూర్వకంగా కలసి వీడ్కోలు పలికారు.

'న్యాయవ్యవస్థపై జగన్ తీరు ఆక్షేపణీయం'

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థపై మాజీ సీఎం జగన్ తీరు ఆక్షేపణీయమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... బలప్రదర్శనతో హైదరాబాద్‌లో సీబీఐ కోర్టుకు హాజరు కావడం సరికాదన్నారు. జగన్ 11 సీబీఐ చార్జిషీట్లలో, 9 ఈడీ కేసుల్లో ఏ1గా 16 నెలలు జైలుజీవితం అనుభవించాడన్నారు. 6 సంవత్సరాలు తరువాత కోర్టుకు హాజరైన ఆయన షరతులతో కోర్టుకు వస్తాననడం భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని తెలిపారు.

యూరియా పంపిణీ



ఏర్పేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాల రైతు సేవా కేంద్రంలో శుక్రవారం ఏర్పేడు తెలుగు యువత అధ్యక్షుడు హేమాక్షిరాయల్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలవాయి, బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని నెలవాయి పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తులసి, బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విమల్ ఈనెల 20న దుగ్గసముద్రంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపబరచి డిసెంబరు 6, 7, 8 నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక య్యారు.

జూడో పోటీలకు...

ఏర్పేడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 జూడో ఎంపిక పోటీల్లో పాపానాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు యామని (44కిలోలు), ధనుష్ (45కిలోలు) విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మారయ్య, వ్యాయామ సంచాలకురాలు పుష్పవాణి తెలిపారు.

చెంచయ్యనాయుడికి సత్కారం



శ్రీకాళహస్తి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన రంగినేని చెంచయ్య నాయుడిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యుడు సుబ్బయ్య ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ చెంచయ్యనాయుడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రెండోసారి నియమితులు కావడం సంతోషకరమన్నారు.

మాక్ అసెంబ్లీపై విద్యార్థులకు డీఈవో శిక్షణ


ఉపాధ్యాయులు, విద్యార్థులతో డీఈవో

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన ఏడుగురు విద్యార్థులకు శుక్రవారం తిరుపతి జిల్లా విద్యాశాఖాధి కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ రాష్ట్ర శాసన సభలో ఎమ్మెల్యేల వలె స్థానిక సమస్యలను ఎలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలో విద్యార్థులకు వివరించారు. స్పీకర్ అధికార పరిధి, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి అధికారాలు, విధులు, శాసనసభ నిర్వహణ, బిల్లులను ఆమోదించడం, చట్టాలను రూపొందించడం, గవర్నర్ పాత్ర తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ట్రైనర్‌గా ప్రధానోపాధ్యాయుడు కూనాటి సురేష్ వ్యవహరించారు. కాగా ఎంపికైన విద్యార్థులు డీఈవో ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో అమరావతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని 26న రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా వారి గొంతుకను వినిపించనున్నారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీశంకర్, సీఎంవో సురేష్ పాల్గొన్నారు.

మహిజకు డీఈవో అభినందన

భారత రాజ్యాంగాన్ని ఆమోదం తెలిపిన రోజును పుస్కరించుకుని నవంబరు 26న రాష్ట్ర రాజధాని అమరావతి అసెంబ్లీలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే స్టూడెంట్ అభ్యర్థిగా ప్రసంగించనున్న బొనుపల్లి పాఠశాల విద్యార్థిని మహిజను డీఈవో కేవీఎన్ కుమార్ శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన తిరుపతి జిల్లా నుంచి వెళుతున్న అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెంచయ్యనాయుడికి అభినందనల వెల్లువ


నియామకపత్రం అందుకుంటున్న చెంచయ్యనాయుడు

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రంగినేని చెంచయ్యనాయుడు రెండవ సారి ఎన్నిక కావడంతో టీడీపీ నాయకులు పలువురు ఆయన్ను అభినందించి సత్కరించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ... చెంచయ్య నాయుడు పార్టీ పటిష్ఠతకు కృషి చేశారన్నారు. చెంచయ్యనాయుడు మాట్లాడుతూ... తనకు ఈ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తనకు ఈ పదవి ఇప్పించడంలో ఎమ్మెల్యే సుధీర్ కృషి చేశారన్నారు. మార్కెట్ కమిటీ ఎదుగుదలకు, రైతులకు సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు మునిరాజానాయుడు, కాసరం రమేష్, అక్కింతల కృష్ణయాదవ్, నాగరాజునాయుడు, పోలూరు శ్రీనివాసులురెడ్డి, మునిరాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన రంగినేని చెంచయ్యనాయుడికి శుక్రవారం మార్కెట్ కమిటీ అధికారులు నియామకపత్రం అందజేశారు.

పోరుబాటను జయప్రదం చేయండి



ఏఐఎస్ఎఫ్ నాయకుల ర్యాలీ

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ఈనెల 28న విజయవాడలో నిర్వహించే విద్యార్థి పోరుబాటును విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండునుంచి అంబేడ్కర్ కూడలి వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి ఒక్కటి కూడా ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెస్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచాలన్నారు. జీవో 77ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ముఖేష్, చైతు, దివ్య, బాబి, ప్రదీప్, మహేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో అరటి ఆకులే వాడండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న హోటళ్లలో పేపర్ పాలిథీన్ ప్లేట్లకు బదులుగా అరటి ఆకుల్లో వడ్డించాలని జిల్లా పంచాయతీ కార్యాలయ రిసోర్సు ఇన్‌చార్జి షణ్ముగం యజమానులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరత్నమ్మ మాట్లాడుతూ... క్యాన్సర్ కారకాల్ని ఉత్పత్తి చేసి జబ్బులకు గురిచేసే పేపర్ ప్లేట్ల వినియోగాన్ని మానుకోవాలని చెప్పారు. అమెరికాలో ఉంటున్న తులసిరాం సహకారంతో అరటి ఆకులను అందజేశారు. యోగా గురువు సునేష్‌నాయుడు, జయచంద్ర, గోపి పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టిద్దాం

కేవీబీపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాలను శుభ్రంగా ఉంచుకుని తడి, పొడి చెత్తలను వేరు చేసి సంపదను సృష్టి ద్దామని ఎంపీడీవో మాలతి అన్నారు. శుక్రవారం కేవీబీపురంలో 29 పంచాయతీల పారిశుధ్య కార్మికులతో ప్రధాన వీధుల్లో తడి, పొడి చెత్తలను వేరుచేసే విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. అంతకుముందు కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో తరుణాక్ష రెడ్డి, కార్యదర్శులు గోవిందస్వామి, ఆనందబాబు, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజం అభివృద్ధి


దాతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజం అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శుక్రవారం నారాయణవనం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మినీ ఆడిటోరియంను ఆయన ప్రారంభించారు. ఆడిటోరియం నిర్మాణానికి రూ.15 లక్షలు సమకూర్చిన లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయిరాం, ఆయన కుమార్తె త్రిపురకు కృతజ్ఞతలు తెలిపారు. బుడ్డి దీపాల్లో చదువుకున్న రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. జడ్పీ ఫైనాన్స్ సభ్యుడు సుమన్ కుమార్, ఎంపీడీవో వేణయ్య, డీటీ భానుచంద్, ఎంఈవో జనార్దన రాజు, పాఠశాల హెచ్‌ఎం మనోహరి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శిక్షణ

నారాయణవనం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతతో వ్యాధులు దరి చేరవని ఎంపీడీవో అరుణ, జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాల య ఆవరణలో పంచాయతీ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద మొక్క నాటి సంరక్షించాలని పేర్కొన్నారు.

పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారాన్ని పురస్కరించుకుని నిత్య కైంకర్యాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉయ్యాలపై అధిష్ఠింపజేసి ఊంజల సేవను నిర్వహించారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



నృత్యం చేస్తున్న విద్యార్థిని

శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ... విద్యార్థులు ఆత్మస్థైర్యంతో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.